Digital, tmedia.net.in

# టీ-మీడియా

మెయిన్ ఎడిషన్

సామాజికం.. ప్రజల పక్షం...

సంపుటి : 8
సంచిక : 302
పేజీలు : 3
గురువారం 4.06.2026

GSTIN: 36FDKPS1308P1ZX | Analytics ID: UA-194163459
Domain ID : DC7812B9B3101414BB98847D724E48B3A-IN

ఎడిటర్ : శనగపాటి మురళీకృష్ణ








## రెస్టారెంట్‌లో...

# భారీ అగ్నిప్రమాదం

- 21 మంది సజీవదహనం
- మృతుల్లో విదేశీయులు



**టి మీడియా, జూన్ 3,ఢిల్లీ బ్యూరో :** ఢిల్లీలో ఘోర అగ్నిప్రమాదం జరిగింది. దక్షిణ ఢిల్లీలోని మాలవీయనగర్‌లోని మికాసా-ఇన్ హోటల్‌లో జరిగిన ప్రమాదంలో 21మంది సజీవ దహనమయ్యారు. అనేకమంది గాయపడ్డారు. సెల్లార్‌లో ఉన్న ముగ్గురిని కాపాడినట్లు పోలీసులు ప్రకటించారు. అగ్నిప్రమాదం జరిగినప్పుడు మికాసా-ఇన్ హోటల్‌లో విదేశీయులుసహా 40మంది వరకు ఉన్నట్లు తెలుస్తోంది.

### అసలేం జరిగింది?

పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం, బుధవారం ఉదయం 8.50గంటల







ప్రాంతంలో ఈ ప్రమాదం జరిగింది. సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక శకటాలు, పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించారు. అయితే, ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉందని అధికారులు తెలిపారు.హోటల్‌లో సుమారు 25గదులు ఉండగా, దాదాపు 40మంది అతిథులు బస చేసినట్లు సమాచారం. వారిలో ఎక్కువమంది వైద్య చికిత్స కోసం వచ్చిన విదేశీయులే అని తెలుస్తోంది. ప్రమాదం జరిగిన సమయంలో హోటల్‌లోని అతిథులు నిద్రలో ఉన్నట్లు సమాచారం. ఉదయం 8.00 గంటల ప్రాంతంలో ఎలక్ట్రిక్ స్టవ్‌ను ఆన్ చేయడానికి ప్రయత్నించినప్పుడు అకస్మాత్తుగా మంటలు ఎగిసిపడ్డాయని హోటల్ చెఫ్ తెలిపారు. అప్పటికే హోటల్ మొత్తం మంటలు వ్యాపించాయని చెప్పారు. అయితే, బాధితులు కొందరు ప్రాణాలు కాపాడుకునేందుకు హోటల్ భవనం నుంచి కిందకు దూకినట్లు స్థానికులు తెలిపారు. ఢిల్లీ ప్రభుత్వ బెడ్ అండ్ బ్రేక్‌ఫాస్ట్‌పథకం కింద ఫ్లోరిశ్? స్టే అనే హోటల్‌కు కేవలం ఆరు గదులను మాత్రమే నిర్వహించడానికి లైసెన్స్ ఉందని, అయితే అగ్నిప్రమాదం జరిగిన సమయంలో అది ఏకంగా 25 గదులతో పనిచేస్తోందని ఓ వార్తా సంస్థ పేర్కొంది.

### స్పందించిన మోదీ

మరోవైపు, ఈ ఘటనపై ప్రధాని నరేంద్ర మోదీ స్పందించారు. "అగ్నిప్రమాదంలో చాలా మంది ప్రాణాలు కోల్పోవడం అత్యంత విషాదకరం. తమ ఆత్మీయులను కోల్పోయిన వారికి నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నా. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తున్నా. ప్రమాద బాధితులకు అధికారులు సాధ్యమైన అన్ని రకాల సహాయాన్ని అందిస్తున్నారు. మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ. 2 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించాం. అలాగే, గాయపడిన వారికి రూ.50,000 ప్రకటించాం" అని మోదీ పేర్కొన్నారు.

### ప్రమాద ఘటనపై ఢిల్లీ సర్కార్ రెస్పాండ్

ఇక, ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తా కూడా ఈ ఘటనపై స్పందించారు. "మృతుల కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నా. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని, ఈ కష్టసమయంలో బాధిత కుటుంబాలకు మనోధైర్యం కలగాలని ప్రార్థిస్తున్నా. ఈ ఘటన గురించి సమాచారం అందిన వెంటనే ఢిల్లీ ఫైర్ సర్వీసెస్, ఢిల్లీ పోలీస్, డీడీఎంఏ, క్యాట్స్ అంబులెన్స్ సర్వీసెస్, ఇతర అత్యవసర సహాయక సంస్థల బృందాలను రంగంలోకి దించి, సహాయక చర్యలు చేపట్టాం. రక్షణ బృందాలు పలువురిని రక్షించి, సురక్షిత ప్రాంతాలకు తరలించారు" అని సీఎం రేఖా గుప్తా అన్నారు.

### విచారం వ్యక్తం చేసిన ఖర్గే

ఈ ప్రమాద ఘటనపై కాంగ్రెస్? జాతీయ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే విచారం వ్యక్తం చేశారు. ఈ దుర్ఘటనలో తమ ప్రియమైన వారిని కోల్పోయిన కుటుంబాలకు సంతాపం తెలిపారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆ దేవుడిని ప్రార్థిస్తున్నానని ఎక్స్?లో పోస్ట్? చేశారు. రాష్ట్ర ప్రభుత్వం, అధికారులు బాధితులకు తక్షణ వైద్య సంరక్షణతో పాటు సకాలంలో నష్టపరిహారం అందించాలని పేర్కొన్నారు. ఈ కష్ట సమయంలో బాధితులకు సాధ్యమైన అన్ని సహాయ సహకారాలు అందించాలని కాంగ్రెస్ కార్యకర్తలను కోరారు.

## కర్ణాటకలో...

# నయా సర్కార్

- ముఖ్యమంత్రిగా డీకే ప్రమాణం
- ఉపముఖ్యమంత్రిగా పరమేశ్వర



**టీ మీడియా జూన్ 3 , బెంగళూరు :** కర్ణాటకలో కొత్త ప్రభుత్వం కొలువుదీరింది. ముఖ్యమంత్రిగా డీకే శివకుమార్ ప్రమాణస్వీకారం చేశారు. లోక్ భవన్‌లోని గ్లాస్‌హౌస్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో గవర్నర్ థావర్?చంద్ గహ్లోత్ డీకే శివకుమార్?తో ప్రమాణం చేయించారు. అలాగే సీనియర్ నేత జి.పరమేశ్వర్ ఉపముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ ఇద్దరితోపాటు మరో 12 మంది మంత్రులుగా బాధ్యతలు తీసుకున్నారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్?సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, కేసీ వేణుగోపాల్, కర్ణాటక మాజీ సీఎం సిద్ధరామయ్య, కేరళ సీఎం సతీశన్, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు భట్టి విక్రమార్క, పొంగులేటి శ్రీనివాస రెడ్డి, అజారుద్దీన్ హాజరయ్యారు.

### చేతిలో రాజ్యాంగం

ప్రమాణ స్వీకారానికి ముందు డీకే వేదికపై నుంచి ప్రజలకు సాష్టాంగ నమస్కారం చేశారు. ఆ తర్వాత తాజా మాజీ ముఖ్యమంత్రి సిద్ధరామయ్యను డీకే సత్కరించారు. అనంతరం తన తాతయ్య గంగాధరయ్య చిత్రపటానికి నివాళులర్పించి ఆయన్ను స్మరించుకుంటూ కర్ణాటక రాష్ట్రానికి 34వ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. ఆ సమయంలో డీకే చేతిలో రాజ్యాంగం బుక్ అందర్నీ ఆకర్షించింది. చేతిలో రాజ్యాంగం బుక్?ను పట్టుకుని అయన ప్రమాణం చేశారు.

### మంత్రులుగా సిద్ధరామయ్య, ఖర్గే కుమారులు

కాగా, డీకే కేబినెట్‌లో మాజీ సీఎం సిద్ధరామయ్య కుమారుడు యతీంద్ర, ఖర్గే కుమారుడు ప్రియాంక్ ఖర్గేకు మంత్రివర్గంలో చోటు దక్కింది. వీళ్లతోపాటుగా కె.హెచ్.మునియప్ప, కె.జె.జార్జ్, ఎం.బి.పాటిల్, రామలింగారెడ్డి, సతీశ్ జర్కిహోళి, కృష్ణబైరెగౌడ, యు.టి.ఖాదిర్, ఈశ్వర్ ఖండ్రే, బైరతి సురేశ్, శరణ్ ప్రకాశ్ పాటిల్‌తో గవర్నర్ థావర్‌చంద్ ప్రమాణం చేయించారు. దీంతో కర్ణాటకలో డీకే శివకుమార్ నేతృత్వంలో నయా సర్కార్ కొలువుదీరింది.

### మోదీ అభినందనలు!

ముఖ్యమంత్రిగా కొత్తగా బాధ్యతలు తీసుకున్న డీకే శివకుమార్?కు ప్రధానమంత్రి నరేంద్రమోదీ శుభాకాంక్షలు తెలిపారు. ప్రజల సంక్షేమం కోసం కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పని చేస్తుందని అన్నారు. ఈ మేరకు ఎక్స్?లో ట్వీట్ చేశారు. 'కర్ణాటక ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన శ్రీ డీకే శివకుమార్?కు అభినందనలు. ప్రజల సంక్షేమం కోసం కేంద్రం కర్ణాటక ప్రభుత్వంతో కలిసి పనిచేస్తుంది' అని మోదీ పోస్ట్‌లో పేర్కొన్నారు.

### సొంత నియోజకవర్గంలో కార్యకర్తల సంబరాలు!

డీకే శివకుమార్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు తీసుకున్న నేపథ్యంలో ఆయన సొంత నియోజకవర్గం రామనగరలో అభిమానులు, కాంగ్రెస్ కార్యకర్తలు బాణాసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. నగరంలోని ఐజూరు సర్కిల్, చన్నపట్న వద్ద బస్ స్టాండ్ వద్ద వందలాది కాంగ్రెస్ కార్యకర్తలు బాణాసంచా కాల్చి, స్వీట్లు పంచిపెట్టారు.

# సభ పెట్టుకోవడం అనేది నా హక్కు..

## జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్

**టి మీడియా, జూన్ 3, హైదరాబాద్ బ్యూరో :** తెలంగాణ భూమి పుత్రుల జాగీరే జనసేన అధ్యక్షుడు, ఏపీ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. గుంటూరు జిల్లా పర్యటనలో ఉన్న పవన్ కల్యాణ్ మంగళవారం హైదరాబాద్‌లోని తన నివాసంలో జరిగిన సభ గురించి స్పందించారు.

### సభకు అనుమతి ఇవ్వడం చిన్న విషయం

ఈ 12 ఏళ్లలో అనేకమంది ఏపీ కాంట్రాక్టర్లు తెలంగాణలో పని చేశారన్న పవన్ కల్యాణ్‌ఈ 12 ఏళ్లలో అనేకమంది తెలంగాణ కాంట్రాక్టర్లు ఏపీలో పని చేశారని తెలిపారు. తన సభకు అనుమతి ఇవ్వడం చిన్న విషయమని, ఇస్తే గొడవే వచ్చేది కాదని అన్నారు. హైదరాబాద్‌లో తనకు ఇల్లు ఉందని, అక్కడ ఉండటం సాధారణమని పేర్కొన్నారు. సభ పెట్టుకోవడం అనేది తన హక్కు అని దాన్ని కాదనకూడదని తెలిపారు.

### రాహుల్ గాంధీకి మంచిది కాదు

రాష్ట్ర విభజనకు నేను ఎప్పుడూ వ్యతిరేకం కాదని మరోసారి పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. ప్రాంతీయ విద్వేషాలు రగల్చడం కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి మంచిది కాదని, కాంగ్రెస్ అగ్రనేతలు దేశ సమగ్రత గురించి మాట్లాడాలని హితవు పలికారు. కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు పాదయాత్ర చేసి ఏం నేర్చుకున్నారని ప్రశ్నించారు. ప్రాంతీయ విద్వేషాలు రెచ్చగొట్టే వారు ప్రజలకు ఏం సందేశం



ఇస్తారని నిలదీశారు. తెలంగాణ, తమిళనాడులో ప్రాంతీయ భావం ఉందని, ఏపీ ప్రజల్లో ఉన్న ఉప ప్రాంతీయవాదం సరికాదని వెల్లడించారు.

### తెలంగాణ జాగీరే

తెలంగాణ మాజీ మంత్రి కేటీఆర్ తనకు సోదరుడితో సమానమన్న పవన్ కల్యాణ్ కేటీఆర్ ఏమన్నారో తాను వినలేదని తెలిపారు. తనకు తెలిసి కేటీఆర్ తప్పుగా మాట్లాడరని, తాము కలిసినప్పుడు ఈ అంశంపై సరదాగా మాట్లాడుకుంటామని అన్నారు. తెలంగాణ భూమి పుత్రుల జాగీరే అని స్పష్టం చేశారు.

# యూఎస్‌తో చర్చలు జరుపుతున్నాం

## అమెరికా టారిఫ్‌ల ప్రతిపాదనల వేళ భారత్

**టీ మీడియా జూన్ 3 , ఢిల్లీ బ్యూరో :** వెట్టిచాకిరి చేసే కార్మికులు తయారుచేసిన దిగుమతులను నిషేధించడంలో విఫలమైన భారత్ సహ 60 దేశాలపై అదనపు సుంకాలు విధించాలని యూఎస్ ట్రేడ్ రిప్రజెంటేటివ్ అమెరికా ప్రభుత్వాన్ని ప్రతిపాదించడంపై ఇండియా స్పందించింది. వెట్టిచాకిరి చేసే కార్మికులు, అదనపు పారిశ్రామిక సామర్థ్యానికి సంబంధించిన ఆందోళనలపై సెక్షన్ 301 ప్రొసీడింగ్స్ విషయంలో భారత్ అమెరికాతో సంప్రదింపులు జరుపుతోందని పేర్కొంది. అదే సమయంలో వాషింగ్టన్‌తో ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందాన్ని ఖరారు చేసే దిశగా కృషి చేస్తోందని పేర్కొంది. ఈ మేరకు కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ ప్రకటన చేసింది.భారత్‌తో సహ 60 దేశాలపై తీసుకున్న చర్యలకు సంబంధించి యూఎస్ ట్రేడ్ రిప్రజెంటేటివ్ దర్యాప్తును పూర్తి చేసిందని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ తెలిపింది. ఈ దర్యాప్తుల అనంతరం 1974 నాటి యూఎస్ వాణిజ్య చట్టంలోని సెక్షన్ 301 ప్రకారం ఈ 60 దేశాల దిగుమతులపై అదనపు సుంకాలను విధించాలని అమెరికా ప్రభుత్వాన్ని ప్రతిపాదించిందని పేర్కొంది. అయితే ఇప్పటికే సెక్షన్ 232 సుంకాల పరిధిలోకి వచ్చే ఉత్పత్తులతో పాటు, మరికొన్ని ఇతర వర్గాలను ఈ ప్రతిపాదిత చర్యల నుంచి మినహాయించిందని స్పష్టం చేసింది.

మూడు నెలల క్రితమే దర్యాప్తు ప్రారంభం



వెట్టిచాకిరి చేసే కార్మికులు తయారుచేసిన వస్తువులను దిగుమతి చేయడం, అదనపు పారిశ్రామిక సామర్థ్యానికి సంబంధించిన ఆందోళనలపై ఇండియా సహా 60 దేశాలపై 2026 మార్చి 11, 12 తేదీలలో రెండు వేర్వేరు సెక్షన్ 301 విచారణలను యూఎస్ ట్రేడ్ రిప్రజెంటేటివ్ ప్రారంభించింది. ఈ క్రమంలో జూన్ 2న కీలక నిర్ణయం తీసుకుంది. వెట్టిచాకిరీ కార్మికులు విషయంలో తన దర్యాప్తు వివరాలను విడుదల చేసింది. 60 దేశాలపై అదనపు సుంకాలను విధించాలని అమెరికా ప్రభుత్వానికి ప్రతిపాదిస్తూ నిర్ణయం తీసుకొంది. 54 దేశాలపై 12.5శాతం, ఆరు దేశాలపై 10 శాతం సుంకాలను విధించాలని ట్రంప్ సర్కార్‌ను కోరింది. ఈ మేరకు యూఎస్ ట్రేడ్ రిప్రజెంటేటివ్ అంబాసిడర్ జెమీసన్ గ్రీర్ ఓ ప్రకటన చేశారు. ఈ ప్రతిపాదనలో కెనడా, ఈక్వెడార్, యూరోపియన్ యూనియన్ (ఈయూ), ఇండోనేసియా, మెక్సికో, పాకిస్థాన్‌ల దిగుమతులపై 10 శాతం అదనపు సుంకం, అలాగే భారత్, చైనాలతో సహా మరో 54 దేశాల దిగుమతులపై 12.5 శాతం సుంకం విధించడం ఉంది. కాగా, వాణిజ్య రంగంలో పాక్, ఇండోనేసియాలు భారత్‌కు ప్రధాన పోటీదారులుగా ఉన్నాయి. కాగా, 60 దేశాలపై అదనపు సుంకాల చర్య ఇంకా ప్రతిపాదన దశలోనే ఉంది. ఇంకా అమలవ్వలేదు.

అమెరికా కార్మికులకు ఇబ్బందులు'

కాగా, వెట్టిచాకిరి చేసే కార్మికులు తయారుచేసిన దిగుమతుల నిషేధంపై యూఎస్ ట్రేడ్ రిప్రజెంటేటివ్ అంబాసిడర్ జెమీసన్ గ్రీర్ కీలక వ్యాఖ్యలు చేశారు. తమ వాణిజ్య భాగస్వామ్య దేశాలు కూడా వెట్టిచాకిరి చేసే కార్మికులు తయారుచేసిన దిగుమతుల నిషేధంలో అరికట్టలేకపోయాయని అన్నారు. ఈ విషయం ఎంత మాత్రం ఆమోదయోగ్యం కాదన్నారు. వెట్టిచాకిరీ కారణంగా అంతర్జాతీయ లేబర్ మార్కెట్లో అమెరికా కార్మికులకు తీవ్ర పోటీ ఎదురవుతోందని చెప్పారు. అసమానతలను తాము ఇక సహించలేమని అసహనం వ్యక్తం చేశారు.

# భూముల ధరలు పెంచిన ప్రభుత్వం

- జూన్ 5 నుంచి అమలు



**టి మీడియా, జూన్ 3, హైదరాబాద్ బ్యూరో :** రాష్ట్ర ప్రభుత్వం భూముల ధరలు పెంచింది. ఈ నిర్ణయం ఈనెల 5 నుంచి అమల్లోకి వస్తుందని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రకటించారు. హేతుబద్ధంగా, శాస్త్రీయంగా క్షేత్రస్థాయి అధ్యయనం తర్వాతే భూముల కొత్త విలువలపై నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఆర్థిక నిపుణులు అరవింద్ సుబ్రమణ్యం ఇచ్చిన నివేదిక మేరకు విస్తృత అధ్యయనం చేశామని వివరించారు. గత బీఆర్?ఎస్? ప్రభుత్వం అశాస్త్రీయ పద్ధతుల్లో 2021, 22 సంవత్సరాలల్లో కేవలం 6 నెలల వ్యవధిలోనే రెండు సార్లు భూముల ధరలను, రిజిస్ట్రేషన్ ఛార్జీలను పెంచిందని మంత్రి పొంగులేటి గుర్తుచేశారు.

### సీఎం ఆలోచనతో నిర్ణయం

రాష్ట్రంలో భూముల విలువల సవరణను శాస్త్రీయంగా, హేతుబద్ధంగా చేపట్టామని పేర్కొన్నారు. క్షేత్రస్థాయి అధ్యయనం, మార్కెట్ పరిస్థితుల విశ్లేషణ ఆధారంగా కొత్త విలువలను నిర్ణయించామని చెప్పారు. సీఎం రేవంత్ రెడ్డి ఆలోచన మేరకు నిపుణుల సూచనలు, అధికారుల సలహాలతో నిర్ణయం తీసుకున్నట్లు స్పష్టం చేశారు.

స్థానిక పరిస్థితులను అధ్యయనం చేసి నిర్ణయం

భూ లావాదేవీల విషయంలో అనేక సమస్యలు ఏర్పడుతున్నట్లు ప్రభుత్వం గుర్తించిందని ఈ సమస్యల పరిష్కారానికే రాష్ట్రవ్యాప్తంగా పునర్విమర్శ చేపట్టామని మంత్రి పొంగులేటి వెల్లడించారు. రాష్ట్రంలోని 144 సబ్?రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో మార్కెట్ విలువల సమీక్ష నిర్వహించామని అన్నారు. గ్రామీణ, పట్టణ మార్కెట్ విలువల సవరణ కమిటీలు స్థానిక పరిస్థితులను అధ్యయనం చేశాయని తెలిపారు.

### ఆ ప్రాంతాల్లో ఎలాంటి పెంపు లేదు

అభివృద్ధి సామర్థ్యం, భూముల డిమాండ్, వేలాలు, మార్కెట్ పరిస్థితులను పరిగణనలోకి తీసుకున్నామని ఆయన చెప్పారు. ఓఆర్?ఆర్? ఆర్?ఆర్?ఆర్ కొత్త రహదారులు, పారిశ్రామికాభివృద్ధి, మౌలిక వసతుల విస్తరణను ప్రమాణాలుగా తీసుకున్నట్లు స్పష్టం చేశారు. ఫ్లాట్ల విషయంలో ఉన్న అసమానతలను తొలగించేందుకు కొన్ని ప్రాంతాల్లో అన్ని అంతస్తులకు ఒకే రేటు అమలు చేశామని అన్నారు. ఇప్పటికే అధిక మార్కెట్ విలువలు ఉన్న ప్రాంతాల్లో ఎలాంటి పెంపు ప్రతిపాదన లేదని వివరించారు.

### ఈ విషయాలను పరిగణలోకి తీసుకొని రేట్లు ఖరారు

హెచ్?ఎండీఏ, సీయూఆర్?ఈ పరిధి, ఇతర ప్రాంతాలకు కనీస ప్రాథమిక మార్కెట్ రేట్లు నిర్ణయించామని ఆయన స్పష్టం చేశారు. వ్యవసాయ భూములు, ప్లాట్లు, ఫ్లాట్లకు

మిగతా 3లో..

# బడి ఈడు పిల్లలందరిని పాఠశాలల్లో చేర్పించాలి

## • జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

**టీ మీడియా, జూన్ 3, వనపర్తి బ్యూరో :** చదువు కున్న ప్రతి విద్యార్థి ఏదో ఒక రంగంలో ఉపాధి పొందే విధంగా రాష్ట్ర ప్రభుత్వం విద్యా శాఖ లో చాలా మార్పులు తీసుకువస్తుందని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అన్నారు.విద్యాశాఖకు సంబందించిన వివిధ అంశాలపై, డిగ్రీ, పాలిటెక్నిక్ కళాశాలల్లో విద్యార్థుల రిజిస్ట్రేషన్ పై, బుధవారం రాష్ట్ర సెక్రెటరీ ఎడ్యుకేషన్ యోగిత రాణా జిల్లా కలెక్టర్లు, విద్యా శాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు చదువు పూర్తి అయిన తర్వాత ప్రస్తుత సమాజంలో ఉపయోగపడి ఉపాధి పొందే విధంగా రాష్ట్ర ప్రభుత్వం కొత్త కొత్త సాంకేతిక కోర్సులను ఈ సంవత్సరం నుండి ప్రవేశ పెడుతుందని తెలిపారు. డిప్లమా ఇన్ సెమీ కండక్టర్ టెక్నాలజీ, సివిల్ ఇంజనీరింగ్ - రియల్ ఎస్టేట్ టెక్నాలజీ, ల్యాండ్ స్కేప్ డిజైన్, మల్టీ మీడియా అండ్ ఎలక్ట్రానిక్స్, అడ్వాన్స్ మాన్యుఫాక్చరింగ్ టెక్నాలజీ, ఎయిర్ క్రాఫ్ట్ మెంటెంటెన్స్, ఆటోమేషన్ అండ్ రోబోటిక్ వంటి సాంకేతిక కోర్సులను ప్రవేశపెడుతుందని తెలిపారు.విద్యార్థులు ఈ సదవకాశాలను సద్వినియోగం చేసుకొని లబ్దిపొందాలని తెలియజేశారు. సాంకేతిక కోర్సులు చదవటం వల్ల అప్రెంటిషిప్ తో పాటు ఉపాధి పొందవచ్చని తెలియజేశారు. వనపర్తి జిల్లాలో 10వ తరగతి, ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత సాధించిన పరి విద్యార్థి ముఖ్యంగా అమ్మాయిలు తదుపరి ఉన్నత విద్యాభ్యాసం పొందే విధంగా కళాశాలల్లో చేర్పించాలని సూచించారు.




బడి బాట కార్యక్రమం ద్వారా బడి ఈడు పిల్లలు ప్రతి ఒక్కరు పాఠశాలల్లో ఉండాలని ఇంటింటికి తిరిగి పాఠశాలల్లో చేర్పించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మరుగుదొడ్లు, తాగునీరు తదితర మౌలిక వసతులు కల్పించడం జరిగిందని, ఎక్కడైనా మౌలిక సదుపాయాలు కొరత ఉంటే ప్రతిపాదనలు ఇవ్వాలని మండల ఎడ్యుకేషన్ అధికారులను ఆదేశించారు.

జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ఎన్రోల్మెంట్స్ పెరగాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ ఏడా ది పదో తరగతి ఫలితాల్లో కూడా మన జిల్లా మంచి ఫలితాలను సాధించిందని ఆ విషయాన్ని ప్రజలకు తెలియజేసి ప్రభుత్వ పాఠశాలల్లో ఎన్రోల్మెంట్స్ పెంచే విధంగా చొరవ తీసుకోవాలన్నారు. జూన్ 4, 6, 8, 10 తేదీల్లో నిర్వహించనున్న గ్రామసభల్లో ప్రభుత్వ పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు పాల్గొని ఎన్రోల్మెంట్స్ పెంపునకు ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. ప్రస్తుతం అన్ని పాఠశాలల్లో టాయిలెట్ ఫెసిలిటీ కల్పించడం జరిగిందని, ప్రభుత్వ పాఠశాలల్లో కలిపిస్తున్న సౌకర్యాల గురించి తెలియజేయాలన్నారు. అదేవిధంగా, మండల విద్యాధికారులు స్కూల్ విసిట్స్ పెంచలన్నారు. ఆపార్ ఐడి జనరేషన్, యూ డైస్ అప్డేషన్, ఆధార్ వెరిఫికేషన్ వంటి అంశాలను పూర్తి చేయడంలో కూడా వేగంగా పురోగతి సాధించాలన్నారు. ఏ ఐ తరగతులు నిర్వహిస్తున్న అన్ని పాఠశాలల్లో కంప్యూటర్లు, ఇంటర్నెట్ సౌకర్యాలు సరిగ్గా ఉండేలా చూడాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు ఖీమ్యా నాయక్, విద్యా శాఖ అధికారులు, ఇంటర్మీడియట్ అధికారి నరేంద్ర కుమార్, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# పెట్రోల్ డీజిల్ కొరతతో ఇబ్బంది

**టీ మీడియా ,జూన్ 3 ,ఆత్మకూర్:**సాగుకు సిద్ధమవుతుండడంతో పంట పొలాల దున్నకాల కోసం ట్రాక్టర్ల లో డీజిల్ లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు.వనపర్తి జిల్లా ఆత్మకూరు మండలం భారత్ పెట్రోల్ బంక్ వద్ద తెల్లవారుజాము నుంచి వాహనదారులు రైతులు పెట్రోల్ డీజిల్ కోసం బారులు తీశారు దాదాపు గంటసేపు క్యూ లైన్ లో నిలబడి పెట్రోల్, డీజీల్ పోయించుకుంటున్నారు. దాదాపు అన్ని బంకుల వద్ద 'నో స్టాక్' బోర్డులు దర్శనమిస్తుండటంతో వాహనదారులు, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం పొలం పనులకు కీలకమైన సీజన్ కావడంతో, పెట్రోల్ డీజిల్ కొరతతో అన్నదాతల పాలిట శాపంగా మారింది. డీజిల్ లేక ట్రాక్టర్లు, ఎక్కడికక్కడే నిలిచిపోవడంతో రైతులు తెల్లవారుజామునే పీపాలు, డ్రమ్ములతో బంకుల వద్దకు క్యూ కడుతున్నారు. ఇంధనం దొరకదేమోనన్న భయంతో వాహనదారులు బాటిళ్లు, డ్రమ్ములలో నిల్వ చేసుకునేందుకు ప్రయత్నిస్తుండటంతో బంకుల వద్ద తోపులాటలు, వాగ్వివాదాలు చోటుచేసుకుంటున్నాయి. , ఆయిల్ కంపెనీల ద్వారా సరఫరాను క్రమబద్ధీకరించాలని ప్రజలు, రైతులు వేడుకుంటున్నారు.




# ప్రాంతీయవాదం ఉగ్రవాదం కంటే ప్రమాదం అంటావా

## • మాజీ మంత్రి సింగిరెడ్డి.నిరంజన్ రెడ్డి

**టీ మీడియా, జూన్ 3, వనపర్తి బ్యూరో :** ప్రాంతీయవాదం ఉగ్రవాదం కంటే ప్రమాదం అంటావాఎవరిదిరా ప్రాంతీయవాదం మాది ముమ్మాటికి జాతీయవాదం.తెలంగాణ రాష్ట్రం ఆషామాషీగా రాలేదు. మా బిడ్డల ఆత్మబలిదానాల త్యాగఫలం.తెలంగాణ ప్రజల మనోభావాల్ని చులకన చేస్తే బిడ్డా నాలుకలు తెగ్గోస్తాం.సింగిరెడ్డి.నిరంజన్ రెడ్డి సుదీర్ఘ పోరాటంతో మా బిడ్డల ఆత్మ బలిదానాలతో రాష్ట్రం సాధించుకున్నామని అటువంటి మమ్మల్ని అవమానిస్తే బిడ్డా నాలుకలు తెగ్గోస్తాం అని హెచ్చరించారు.కార్యక్రమములో మాజీ హోమ్ మినిస్టర్ మహమూద్ పాషా, రాష్ట్ర కార్యదర్శి మెట్టు.శ్రీనివాస్, రాష్ట్ర నాయకులు పల్లె రవి నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.



# ఆదుకున్న ఆత్మీయ చారిటబుల్ ట్రస్టు

**టీ మీడియా, జూన్ 3, రామకృష్ణాపూర్:**క్యాతనపల్లి మున్సిపాలిటీ రామకృష్ణాపూర్ లోని జ్యోతి నగర్ కు చెందిన పాండురాజు రాయమల్లు గుండెలో మూడు కవాటాలు మూసుకుపోయి తీవ్ర ప్రాణాపాయ స్థితిలో ఉన్నాడు. తన ఆపరేషన్ కు దాదాపు 5 లక్షల వరకు ఖర్చు అవుతుందని వైద్యులు చెప్పారు.కూలి పనులు చేసుకునే అతని ఆర్థిక పరిస్థితి బాగా లేనందున ఆపరేషన్ చేయించుకునే స్తోమత లేక సహాయం కోసం ఆత్మీయ చారిటబుల్ ట్రస్టును సంప్రదించడం జరిగింది.దీనికి స్పందించిన ఆత్మీయ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు,బుధవారం రాయమల్లు నివాసమునకు వెళ్ళి పది వేల రూపాయల చెక్కును ఆర్థిక సహాయంగా అందించడం జరిగింది.ఈ కార్యక్రమంలో ట్రస్టు అధ్యక్షులు సుంకరి మల్లేష్,సట్ల మహేందర్,నడిగోట తిరుపతి, రఘు పాల్గొన్నారు.



# రాజకీయాల్లోకి ప్రముఖ నాయకుల కూతుళ్లు, కోడళ్లు

**టీ మీడియా, జూన్ 3,అమరావతి,బ్యూరో :** పొలిటికల్‌గా మంచి ఫామ్‌లో ఉన్నప్పుడే తమ వారసులను రంగంలోకి దించేందుకు నెల్లూరు జిల్లా (సింహపురి) నేతలు వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నారు. అధికారం తమ కుటుంబం నుంచి చేజారకూడదనే గట్టి పట్టుదలతో ఉన్న ముఖ్య నాయకులు.. వచ్చే ఎన్నికల్లో తమ కుమార్తెలను బరిలోకి దించేందుకు సర్వం సిద్ధం చేస్తున్నారు. భవిష్యత్తులో నియోజకవర్గాలు మహిళలకు రిజర్వ్ అయ్యే అవకాశం ఉండటంతో.. ఇప్పుడే తమ కూతుళ్లను జనంలోకి తీసుకెళ్తూ గ్రౌండ్ వర్క్ ప్రారంభించారు. వచ్చే ఎన్నికల్లో మహిళా రిజర్వేషన్లు అమలు చేస్తామని అధికార తెలుగుదేశం పార్టీ (టీడీపీ) స్పష్టం చేయడంతో పాటు మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని మంత్రి నారా లోకేష్ ప్రకటించిన నేపథ్యంలో ఈ ఊహాగానాలు మరింత జోరందుకున్నాయి.ఇప్పటికే అధికార, ప్రతిపక్షాలకు చెందిన పలువురు ప్రముఖ నేతల కుమార్తెలు, కోడళ్లు పొలిటికల్ స్క్రీన్ మీదకు వచ్చి యాక్టివ్ అవుతున్నారు. నెల్లూరు జిల్లాలో ఇప్పటికే కోవూరు నుంచి ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంత్ రెడ్డి, సూళ్లూరుపేట నుంచి నెలవల విజయశ్రీతో పాటు మరో ముగ్గురు నలుగురు నేతలు నియోజకవర్గాల్లో పర్యటిస్తున్నారు. మరికొందరు సీనియర్ నేతలు తమ వారసురాళ్లను ప్రమోట్ చేసే పనిలో పడ్డారు. మాజీ మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డి జైలుకు వెళ్లిన సమయంలో ఆయన పెద్ద కుమార్తె కాకాని పూజిత పూర్తి స్థాయి రాజకీయాల్లోకి వచ్చారు. సర్వేపల్లి నియోజకవర్గ క్యాడర్ చెక్కుచెదరకుండా అండగా నిలిచారు. ఈ క్రమంలోనే వైఎస్సార్సీపీ ఆమెకు మహిళా విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బాధ్యతలు అప్పగించింది. వచ్చే ఎన్నికల్లో ఆమె కోసం మరో నియోజకవర్గాన్ని కాకాని పరిశీలిస్తున్నట్లు సమాచారం.ఆత్మకూరు నియోజకవర్గ ప్రతినిధి, మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి సైతం తన కూతురు ఆనం కైవల్యను వచ్చే ఎన్నికల్లో బరిలోకి దించే ఆలోచనలో ఉన్నారు. ఇప్పటి నుంచే నియోజకవర్గానికి తీసుకువెళ్తూ ఆమెను ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రొజెక్ట్ చేస్తున్నారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో మహిళా రిజర్వేషన్ వస్తే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి వారసత్వాన్ని అందుకోవడానికి ఆయన కుమార్తె వైష్ణవి సిద్ధంగా ఉన్నారనే ప్రచారం ఊపందుకుంది. నెల్లూరు సిటీలో మంత్రి నారాయణ తన కుమార్తె శరణ్‌ను జనంలో తిప్పుతున్నారు. ఇప్పటికే నియోజకవర్గంలో జరిగే అభివృద్ధి పనుల పర్యవేక్షణ బాధ్యతలను ఆమె చూసుకుంటున్నారు.కేవలం కుమార్తెలే కాకుండా కుటుంబంలోని ఇతర మహిళా సభ్యులను కూడా కీలక స్థానాల్లో నిలబెట్టేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. సర్వేపల్లి నియోజకవర్గంలో సోమిరెడ్డి కోడలు శృతి బరిలో ఉంటారన్న టాక్ గట్టిగా వినిపిస్తోంది. గత ఎన్నికల ప్రచారంలో మాజీ మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డికి దీటుగా విమర్శలు చేయడంలో శృతి సక్సెస్ అయ్యారని, ఈ క్రమంలో వచ్చే ఎన్నికల్లో ఆమె పేరు పరిశీలనలో ఉందని టీడీపీ వర్గాల్లో చర్చ సాగుతోంది. గత ఎన్నికల్లో వెంకటగిరి నియోజకవర్గం నుంచి టీడీపీ అభ్యర్థిగా కురుగొండల కుమార్తె లక్ష్మీ ప్రియ పేరు ఖరారైనప్పటికీ.. చివరి నిమిషంలో ఆయనే పోటీ చేశారు. అయితే ఈసారి ఆయన కుమార్తె లక్ష్మీ ప్రియ లేదా భార్య సింధు బరిలో ఉండే అవకాశాలు ఉన్నాయని సమాచారం. తాము పదవుల్లో ఉన్నప్పుడే, అధిష్టానం ఆశీస్సులు ఉన్నప్పుడే వారసురాళ్లను పటిష్టంగా నిలబెట్టాలనే సింహపురి నేతల వ్యూహం ఏ మేరకు సఫలమవుతుందో, రాబోయే ఎన్నికల్లో ఎంతమంది మహిళా నేతలు అసెంబ్లీ మెట్లు ఎక్కుతారో చూడాలి.

# పనులను పరిశీలించిన కమిషనర్



**టీ మీడియా ,జూన్ 3, ఆత్మకూర్:**వనపర్తి జిల్లా ఆత్మకూర్ మున్సిపాలిటీ పరిధిలో చేపడుతున్న పారిశుద్ధ్య పనులను మున్సిపల్ కమిషనర్ ఎ. నరేష్ కుమార్ నేడు ఆకస్మికంగా పరిశీలించారు. పట్టణంలోని పలు వార్డులలో పర్యటించి వీధుల పరిశుభ్రత, చెత్త సేకరణ, డ్రైనేజీల శుభ్రపరిచే పనులు, డోర్ టు డోర్ చెత్త సేకరణ, తడి-పొడి చెత్త వేరు చేసే విధానాన్ని పరిశీలించారు.ఈ సందర్భంగా కమిషనర్ పారిశుద్ధ్య సిబ్బందితో మాట్లాడి పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు మరింత కృషి చేయాలని సూచించారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణలో పారిశుద్ధ్యానికి అత్యంత ప్రాధాన్యత ఉందని పేర్కొంటూ, ప్రతిరోజూ చెత్త సేకరణను సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. డ్రైనేజీలలో చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలు వేయకుండా ప్రజలు సహకరించాలని కోరారు. అలాగే ఇంటి వద్దే తడి, పొడి చెత్తను వేరు చేసి మున్సిపల్ సిబ్బందికి అందించాలని సూచించారు. పట్టణంలో ఎక్కడైనా చెత్త కుప్పలు లేదా పారిశుద్ధ్య సమస్యలు ఉన్నట్లయితే వెంటనే మున్సిపాలిటీ దృష్టికి తీసుకురావాలని తెలిపారు.మున్సిపాలిటీ పరిధిలో పారిశుద్ధ్య నిర్వహణను మరింత మెరుగుపరచడానికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని, ప్రజల సహకారంతో ఆత్మకూర్‌ను పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన పట్టణంగా తీర్చిదిద్దుతామని కమిషనర్ ఎ. నరేష్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ పారిశుద్ధ్య సిబ్బంది, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# చిన్ననాటి స్నేహితుడికి ఆర్థిక సహాయం



**టీ మీడియా, జూన్ 3, వనపర్తి బ్యూరో :** వనపర్తి జెడ్పిహెచ్ఎస్ బాయ్స్ స్కూల్ 2000-01 స్నేహితుల బృందం, పీర్లగుట్ట కాలనీకి చెందిన తమ చిన్ననాటి స్నేహితుడు ఆంజనేయులు పక్షవాతం కారణంగా మంచానికి పరిమితమయ్యాడు.అతని విషయం తెలుసుకొని చిన్ననాటి మిత్ర బృందం బుధవారం 38 వేల రూపాయలు ఆర్థిక సాయం అందించారు. పరామర్శించిన వారిలో ఉమామహేశ్వర్, అబ్దుల్లా, మల్లేష్ యాదవ్, దేవయ్య, మారం మల్లేష్, భాస్కర్, నగేష్, లక్ష్మణ్ తదితర స్నేహితులు పాల్గొన్నారు. మిగిలిన మిత్ర బృందం ఆర్థిక సాయం చేసిన ప్రతి ఒక్కరికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు భవిష్యత్తు అవసరాల దృష్ట్యా ఆర్థిక భరోసా, ధైర్యంగా ఉండమని చెప్పాడం జరిగింది.

# అటవీశాఖ ఆధ్వర్యంలో పర్యావరణం పై అవగాహన




**టీ మీడియా, జూన్ 3, వనపర్తి బ్యూరో :** వనపర్తి జిల్లా కేంద్రంలోని ఏకో పార్కులో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక పర్యావరణ వారోత్సవాల్లో భాగంగా అటవీశాఖ ఆధ్వర్యంలో పర్యావరణం పై అవగాహన కల్పిస్తూ సైక్లింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సైక్లింగ్ కార్యక్రమానికి వనపర్తి మున్సిపల్ చైర్పర్సన్ మాధవి జెండా ఊపి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మేఘారెడ్డి, జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, స్థానికులతో కలిసి ఎకో పార్కులో ఐదు కిలోమీటర్ల మేర సైక్లింగ్, వాకింగ్ కార్యక్రమంలో పాల్గొని సైకిల్ తొక్కి పర్యావరణ పరిరక్షణ ప్రాముఖ్యతను తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి అడవుల పెంపకం పై అవగాహన కల్పిస్తామని చెప్పారు. సైక్లింగ్, వాకింగ్ ట్రాక్ సందర్శించి అటవీ శాఖ పరిధిలో చెక్ డాం లు, కుంటాలను పరిశీలన చేయడం జరిగింది అన్నారు. జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి మాట్లాడుతూ ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక పర్యావరణ వారోత్సవాల్లో భాగంగా అదేవిధంగా ప్రపంచ సైకిల్ దినోత్సవం సందర్భంగా ఈరోజు ఎకో పార్కులో సైక్లింగ్ కార్యక్రమం నిర్వహించడం ఆనందంగా ఉందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అటవీ శాఖ అధికారి శివ ఆశిష్, వనపర్తి మున్సిపల్ చైర్ పర్సన్ మాధవి, డిపిఆర్ఓ సీతారాం, డి వై ఎస్ ఓ సుధీర్ రెడ్డి, ఇతర ప్రజాప్రతినిధులు, కౌన్సిలర్లు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# చిన్నారికి మేఘన అభయహస్తం అందజేత



**టీ మీడియా, జూన్ 3, వనపర్తి బ్యూరో :** పెద్దమందడి మండలం దొడగుంటపల్లి గ్రామానికి చెందిన రేణుక దీర్ఘకాల వ్యాధితో బాధపడుతూ బుధవారం మృతి చెందింది.ముదిరాజ్ కుటుంబానికి చెందిన రేణుక తల్లిదండ్రులు చనిపోయారు, భర్త లేడు, తాను చనిపోతానని తెలిసి తన చిన్నారి కూతురు భవ్యశ్రీని కంటికి రెప్పలా కాపాడుకుంటూ 5వ తరగతి వరకు చదివించింది గత కొంతకాలంగా ఆరోగ్యం సహకరించకపోవడంతో ఇంట్లోనే ఉండేది మంగళవారం రాత్రి అనుకోకుండా ఆమె ఆరోగ్య పరిస్థితి విషమించింది ఆసుపత్రికి తీసుకువెళ్లిన ఫలితం లేకపోయింది. అమె మృతి చెందడంతో ఆమె తరపు బంధువులు ఆసుపత్రి నుంచి మృతదేహాన్ని ఇంటికి తీసుకువచ్చారు.తనకున్న ఒకే ఒక ఆధారం తన తల్లి చనిపోవడంతో ఆ చిన్నారి హృదయ వేదనతో ఏడ్చిన ఏడుపులు చూపరులను సైతం కన్నీళ్లు పెట్టించాయి.రేణుక మృతదేహాన్ని ఖననం చేసేందుకు కూడా ఆర్థిక స్తోమత లేకపోవడంతో గ్రామస్తులు చందాలు వేసుకుని ఆమె దహన సంస్కారాలకు తోడ్పాటు అందించారు.విషయం తెలుసుకున్న వనపర్తి శాసనసభ్యులు తీవ్ర మనోవేదనకు గురై తక్షణ సహాయంగా 5000 రూపాయలు అందించారు.చిన్నారికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఆమె చదువును, బాగోగులను సైతం చూస్తానని అధైర్యం వద్దని ఎమ్మెల్యే భరోసా కల్పించారు.

# ఇందిరమ్మ చీరల పంపిణీ



**టీ మీడియా, జూన్ 3 పెబ్బేరు:**పెబ్బేరు మండలం కేంద్రంలోని 3వ వార్డ్ లోని బి సి కాలనీ లో మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఇందిరమ్మ చీరలు పంపిణీ చేశారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మున్సిపల్ చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్ వైస్ చైర్మన్ సుమిత్రా ఎల్లారెడ్డి మార్కెట్ చైర్మన్ ప్రమోదిని రెడ్డి వైస్ చైర్మన్ ఎద్దుల విజయ వర్ధన్ రెడ్డి కౌన్సిలర్ లు హరి శంకర్ నాయుడు దాసరి జమ్ములమ్మ టౌన్ ప్రెసిడెంట్ దయాకర్ రెడ్డి మహిళా సంఘం అధ్యక్షులు అక్కల జ్యోతి శ్యామల అర్ పి విజయలక్ష్మి మహిళా సంఘాల సభ్యులు కార్యకర్తలు పాల్గోన్నారు.




# ఎయిర్‌పోర్టుపై ఇరాన్ డ్రోన్ దాడి

## • భారతీయుడు మృతి

**టీ మీడియా జూన్ 3 , ఢిల్లీ బ్యూరో :** కువైట్‌లోని కువైట్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టుపై మంగళవారం ఇరాన్ జరిపిన డ్రోన్ దాడిలో ఒక భారతీయుడు మరణించాడు. ఈ విషయాన్ని కువైట్‌లోని భారత రాయబార కార్యాలయం బుధవారం వెల్లడించింది. ఈ సందర్భంగా మృతుడి కుటుంబానికి తీవ్ర సానుభూతి ప్రకటించింది. మృతుడి కుటుంబాన్ని సంప్రదించామని, అతడి కుటుంబానికి అవసరమైన సాయం అందిస్తామని ఎంబసీ ప్రకటించింది. ఈ విషయంలో కువైట్ అధికారులతో కూడా సంప్రదిస్తున్నామని తెలిపింది.ఈ దాడి ఘటనలో గాయపడ్డ ఇతర భారతీయులకు కూడా అవసరమైన వైద్య సాయం అందిస్తామని, బాధిత కుటుంబాల్ని సంప్రదిస్తామని ప్రకటించింది. ఈ మేరకు కువైట్‌లోని భారత ఎంబసీ తన ఎక్స్‌లో పోస్ట్ చేసింది. ఇరాన్ జరిపిన డ్రోన్ దాడిలో 63 మంది గాయపడ్డారని కువైట్ అధికారులు తెలిపారు. గాయపడిన వారిలో ఎయిర్‌పోర్టు సిబ్బందితోపాటు ప్రయాణికులు కూడా ఉన్నారని వెల్లడించింది. బాధితుల్లో కొందరికి తీవ్ర గాయాలయ్యాయి. ఎయిర్‌పోర్టు వద్ద 25కుపైగా అంబులెన్స్‌లు సేవల్లో పాల్గొంటున్నాయని కువైట్ అధికారులు తెలిపారు. పశ్చిమాసియాలో యుద్ధ వాతావరణం ఇంకా కొనసాగుతూనే ఉంది. లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడులు చేస్తోంది. గల్ఫ్? దేశాలపై ఇరాన్ డ్రోన్ దాడులు చేస్తోంది. ఇరాన్‌పై అమెరికా దాడులు చేస్తోంది.ఒక పక్క చర్చలు నడుస్తున్నాయని ప్రకటిస్తున్నా దాడులు మాత్రం ఆగడం లేదు. తాజాగా ఇరాన్‌లోని గెరుక్, ఖేష్మ్ ద్వీపాలపై అమెరికా వైమానిక దాడులు చేసింది. దీంతో బదులుగా ఇరాన్ కూడా బహ్రెయిన్, కువైట్‌లోని స్థావరాలపై దాడులు చేస్తోంది. ఇరాన్ దాడుల నేపథ్యంలో విమాన సర్వీసులు నిలిపివేస్తున్నట్లు అక్కడి జనరల్ సివిల్ ఏవియేషన్ అథారిటీ ప్రకటించింది. విమానాశ్రయం దెబ్బతినడం వల్ల ఈ నిర్ణయం తీసుకున్నామని చెప్పింది. ఈ ఎయిర్‌పోర్టుకు రావాల్సిన అనేక విమానాల్ని ఇతర ప్రాంతాలకు మళ్లించారు.



# తెలంగాణకు కొత్తగా రెండు హైవేలు

## • కేంద్రం గ్రీన్ సిగ్నల్

**టీ మీడియా జూన్ 3 , హైదరాబాద్ బ్యూరో :**తెలంగాణకు కేంద్ర ప్రభుత్వం శుభవార్త అందించింది. రాష్ట్రంలో పలు జాతీయ రహదారుల ప్రాజెక్టులు చేపట్టేందుకు ఇవాళ కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. బుధవారం ప్రధాని మోదీ అధ్యక్షతన కేంద్ర కేబినెట్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. దేశవ్యాప్తంగా పలు కొత్త ప్రాజెక్టులు ప్రకటించగా.. తెలంగాణలో కూడా నేషనల్ హైవే ప్రాజెక్టులకు ఆమోదముద్ర వేశారు. తెలంగాణలో యన్ హెచ్ -63,యన్ హెచ్ -563లోని వివిధ సెక్షన్లను నాలుగు లేన్లుగా విస్తరించేందుకు కేంద్ర మంత్రివర్గం ఆమోదించింది. ఇందుకోసం రూ.7,597 కోట్లు కేటాయించేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఇక తెలంగాణతో పాటు పలు రాష్ట్రాల్లో జాతీయ రహదారులకు ఆమోదం తెలిపింది.

### రూ.39 వేల కోట్ల ప్యాకేజీ

దేశవ్యాప్తంగా మౌలిక సదుపాయాల కోసం రూ.39,290 కోట్ల పెట్టుబడికి కేబినెట్ ఆమోదం తెలిపింది. మొత్తం ఆరు ముఖ్యమైన ప్రతిపాదనలను ఈ సమావేశంలో ఆమోదించారు. దేశవ్యాప్తంగా మౌలిక సదుపాయాల అభివృద్ధిని వేగవంతం చేయడానికి పలు రాష్ట్రాల్లో జాతీయ రహదారి ప్రాజెక్టులను ఆమోదించింది. రామేశ్వరం-కోణార్క్-పారాదీప్ కోస్టల్ హైవే ప్రాజెక్ట్‌ను ఆమోదించగా.. ఇందుకు రూ.8,301 కోట్లు ఖర్చు చేయనుంది. దేశంలోని తూర్పు తీర ప్రాంతంలో అనుసంధానాన్ని ఈ ప్రాజెక్ట్ బలోపేతం చేస్తుందని కేంద్రం భావిస్తోంది. ఇక బీహార్‌లోని ఖగారియా-పూర్నియా సెక్షన్‌ను నాలుగు లేన్లుగా విస్తరించే ప్రాజెక్టుకు రూ.3,936 కోట్లు ఆమోదించారు. మధ్యప్రదేశ్‌లో 347దీ అప్‌గ్రేడ్ కోసం రూ.4,415 కోట్ల పెట్టుబడిని కూడా ఆమోదించారు. అలాగే ఎలక్ట్రిక్ వాహనాలకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వాలు కొత్త వాహనాల కొనుగోలుపై 100 శాతం మోటారు వాహన పన్ను మినహాయింపు రిజిస్ట్రేషన్ ఫీజులో ఉపశమనాన్ని కూడా అందిస్తాయి. అయితే ఈ ప్రయోజనం తమ పాత వాహనాలను స్క్రాప్ చేసే లేదా వాటిని న కాప్ యేతర నగరాలకు తరలించే వాహన యజమానులకు మాత్రమే అందుబాటులో ఉంటుంది.

# దక్షిణ మధ్య రైల్వేకు బ్యాక్‌బోన్‌గా తెలంగాణ

- అతిపెద్ద డివిజన్‌గా సికింద్రాబాద్



**టి మీడియా, జూన్ 3, హైదరాబాద్ బ్యూరో :** భారతీయ రైల్వే వ్యవస్థలో అత్యంత కీలకమైన దక్షిణ మధ్య రైల్వే జోన్ ఒక సరికొత్త రూపును సంతరించుకుంది. భౌగోళిక పునర్విభజన ప్రక్రియ పూర్తి కావడంతో, సరికొత్త సరిహద్దులు, నూతన వ్యూహాత్మక మార్పులతో ఈ జోన్ తన అధికారిక కార్యకలాపాలను జూన్? 1వ తేదీ నుంచి విజయవంతంగా ప్రారంభించింది.పునర్విభజన తర్వాత కొత్త సరిహద్దు ప్రాంతాలతో దక్షిణ మధ్య రైల్వే జోన్ కార్యకలాపాలు కొనసాగుతున్నాయి. ఎస్?సీఆర్? జోన్ పరిధిలో మొత్తం ఐదు రాష్ట్రాలు ఉండగా, రైల్వేట్రాక్ విస్తీర్ణం పరంగా తెలంగాణ, మహారాష్ట్ర తొలి రెండు స్థానాల్లో నిలిచాయి. ఆ తర్వాత కర్ణాటక ఉండగా ఆంధ్రప్రదేశ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల పరిధిలోని పాక్షిక ప్రాంతం జూన్ 1వ తేదీ నుంచి సికింద్రాబాద్ కేంద్రంగా ఉన్న దక్షిణ మధ్య రైల్వే పరిధిలోకి వచ్చి చేరాయి.

### మూడు గ్రూపులుగా విభజన

దక్షిణ మధ్య రైల్వే జోన్ మే నెలాఖరు వరకు 6,638 ట్రాక్ కిలోమీటర్లతో నడిచింది. ఆంధ్రప్రదేశ్?లో విశాఖపట్నం కేంద్రంగా దక్షిణ కోస్తా జోన్ ఏర్పడటంతో గుంటూరు, విజయవాడ, గుంతకల్ డివిజన్లు అందులోకి వెళ్లిపోయాయి. అయితే పలు టెక్నికల్ సమస్యలతో గుంటూరు, గుంతకల్ డివిజన్లలో కొంత రైల్వే నెట్‌వర్క్‌ను సికింద్రాబాద్ డివిజన్‌లో కలిపారు. సికింద్రాబాద్ డివిజన్‌లో కొంత భాగం విజయవాడ డివిజన్‌లో కలిపారు. ఫలితంగా విభజన తర్వాత దక్షిణ మధ్య రైల్వే(సికింద్రాబాద్ కేంద్రం) 3,605.220 రూట్ కిలో మీటర్లలతో సోమవారం నుంచి కార్యకలాపాలు ప్రారంభించింది. జోన్ పరిధిలో సెక్షన్లను ఎ,బి,సి,డిలు అనే నాలుగు గ్రూపులుగా విభజించారు.

గ్రూప్-ఎ : కాజీపేట-మోటుమర్రి, బల్లార్ష-కాజీపేట, కాజీపేట దగ్గరలోని బైపాస్ ఇలా మూడు సెక్షన్లు ఇందులో ఉన్నాయి. మొత్తం రూట్ కిలో మీటర్లు 391.300, రన్నింగ్ కిలో మీటర్లు 1,130.695గా ఉంది.

గ్రూప్-బి : సికింద్రాబాద్-వాడి, పగిడిపల్లి-విష్ణుపురం, కాజీపేట-సికింద్రాబాద్, సికింద్రాబాద్-ఫలక్‌నుమా-డోన్, సికింద్రాబాద్-బొల్లారం-ముద్కేడ్ సహా ఎనిమిది సెక్షన్లను ఇందులో పెట్టారు. మొత్తం రూట్ కిలో మీటర్లు 1,465.060, రన్నింగ్ కిలో మీటర్లు 2,175.013గా ఉంది.

గ్రూప్-సి : కాజీపేట-హసన్‌పర్తి బైపాస్ లైన్‌ను ఇందులో చేర్చారు.

గ్రూప్-డి : వికారాబాద్-పర్లి, పెద్దపల్లి-కరీంనగర్, భద్రాచలంరోడ్-మణుగూరు, మనోహరాబాద్-సిద్దిపేట సహా 35 సెక్షన్లను గ్రూప్-డీలో చేర్చారు. మొత్తం ట్రాక్? రూట్ కిలో మీటర్లు 1,681.950 కాగా రన్నింగ్ కిలో మీటర్లు 1,717.519గా నిర్ణయించారు.

### సికింద్రాబాద్? నుంచి విశాఖపట్నానికి ఉద్యోగులు

దక్షిణ కోస్తా జోన్‌పరిపాలన వ్యవస్థను బలోపేతం చేసేందుకు రైల్వే బోర్డు జనరల్ మేనేజర్, ప్రిన్సిపల్ హెడ్ ఆఫ్ ది డిపార్ట్‌మెంట్ పోస్టుల్లో మే నెలలో సంబంధిత అధికారులను నియమించింది. దక్షిణ కోస్తా జోన్‌కు 128 గెజిటెడ్, 1,100 నాన్‌గెజిటెడ్ అధికారుల పోస్టులను రైల్వేబోర్డు మంజూరు చేసిన సంగతి తెలిసిందే. దక్షిణ మధ్య రైల్వే జోన్(సికింద్రాబాద్) నుంచి కొత్త జోన్(విశాఖపట్నం)కు పోస్టులు భారీగా బదిలీ అయ్యాయి. 35 గెజిటెడ్, 980 నాన్‌గెజిటెడ్ పోస్టులను రైల్వే బోర్డు ట్రాన్స్?ఫర్ చేసింది. మిగతా పోస్టులు సమీపంలోని ఇతర జోన్ల నుంచి బదిలీ చేసే ప్రక్రియను కర్షీదా చేపట్టింది. కాగా దక్షిణ కోస్తా జోన్‌లో 30 మంది గెజిటెడ్, 300 పైచిలుకు నాన్‌గెజిటెడ్ అధికారులు విధుల్లో చేరినట్లు రైల్వేవర్గాల అధికారికంగా తెలిపాయి.

సౌత్ కోస్ట్ జోన్

గుంతకల్లు, గుంటూరు, విజయవాడ డివిజన్లతో పాటు కొత్తగా వాల్తేరు డివిజన్ స్థానంలో కొత్తగా ఏర్పాటు చేసిన విశాఖపట్నం డివిజన్‌తో కలిపి మొత్తం నాలుగు డివిజన్లతో కొత్తగా దక్షిణ కోస్తా రైల్వే జోన్ కార్యకలాపాలను ప్రారంభించింది.

# నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్..

- సెన్సెక్స్ 323 పాయింట్లు పతనం




**టీ మీడియా జూన్ 3 , ముంబై:** భారత స్టాక్ మార్కెట్లు బుధవారం నష్టాల్లో ముగిశాయి. ట్రేడింగ్ ముగిసే సమయానికి బీఎస్ఈ సెన్సెక్స్ 323 పాయింట్లు నష్టపోయి 74,326 పాయింట్ల వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 86 పాయింట్లు నష్టపోయి 23,396 వద్ద ముగిసింది. ఉదయం ట్రేడింగ్ నష్టాలతోనే ప్రారంభమైంది. సెన్సెక్స్ 74,300 పాయింట్లతో, 350కిపైగా పాయింట్ల నష్టంతో ప్రారంభమైంది. ఎన్ఎస్ఈ నిఫ్టీ కూడా 100 పాయింట్ల నష్టంతో 23,400 వద్ద ప్రారంభమైంది. రోజంతా ట్రేడింగ్ నష్టాల బాటలోనే సాగింది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్? ఇండియా పాలసీ మీటింగ్ ఈ రోజు ప్రారంభమైంది. వారాంతం వరకు కొనసాగనుంది. దీంతో వడ్డీ రేట్లు, ద్రవ్యోల్బణం వంటి అంశాల్లో ఆర్బీఐ ఎలాంటి నిర్ణయం తీసుకుంటుంది అనే అంశంపై ఇన్వెస్టర్లు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. అమెరికా-ఇరాన్ మధ్య కొనసాగుతున్న ఉద్రిక్తతలు మార్కెట్‌పై నెగెటివ్ ప్రభావం చూపాయి. హోర్ముజ్ జలసంధి పూర్తిగా ఓపెన్ కాకపోవడం, చమురు ధరల పెరుగుదల వంటివి కూడా మార్కెట్‌పై ప్రభావం చూపాయి. దీంతో అమ్మకాల ఒత్తిడి పెరిగి మార్కెట్ నష్టాల్లో ముగిసింది. సెన్సెక్స్ 30 సూచీలో టీసీఎస్, ఇన్ఫోసిస్, ఐటీసీ, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, టెక్ మహీంద్ర షేర్లు అత్యధికంగా నష్టపోయాయి. వీటిలో టీసీఎస్ షేర్ దాదాపు 9 శాతం పతనమైంది. కోవిడ్ తర్వాత టీసీఎస్ షేర్లు ఈ స్థాయిలో పతనమవ్వడం ఇదే మొదటిసారి. పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, ట్రెంట్, ఇండిగో, ఎస్బీఐ, ఐసీఐసీఐ షేర్లు లాభాలు చవిచూశాయి. అంతర్జాతీయ మార్కెట్లో బ్యారెల్ క్రూడాయిల్ ధర 98 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. బంగారం ఔన్స్ ధర అంతర్జాతీయ విపణిలో 4,461 డాలర్ల వద్ద కొనసాగింది. డాలర్‌తో రూపాయి మారక విలువ 95.71గా ఉంది.

# భారత్‌తో సహా 60 దేశాలపై అమెరికా ఆంక్షలు

- 12శాతం అదనపు సుంకాలకు ప్లాన్



**టీ మీడియా జూన్ 3 , ఢిల్లీ బ్యూరో :** అగ్రరాజ్యం అమెరికా కీలక నిర్ణయం తీసుకుంది. వెట్టిచాకిరీ చేస్తున్న కార్మికులతో ఉత్పత్తి చేసిన వస్తువుల దిగుమతిని నిషేధించడంలో విఫలమైనందుకు భారత్ సహా 60 దేశాలపై 12.5 శాతం అదనపు సుంకాలను విధించాలని నిర్ణయించింది. ఈ మేరకు యూఎస్ వాణిజ్య ప్రతినిధి కార్యాలయం అమెరికా ప్రభుత్వానికి ప్రతిపాదించింది. యూఎస్ఎంసీఏ, పరస్పర వాణిజ్య ఒప్పందాలలోని అంశాలతో సహా వెట్టిచాకిరీ చేసే కార్మికులు తయారుచేసిన వస్తువుల దిగుమతిని నిరోధించడానికి కొంత మంది వాణిజ్య భాగస్వాములు ప్రాథమిక చర్యలు తీసుకున్నారు. కార్మికుల వెట్టిచాకిరీని దురుద్దేశపూర్వకంగా ప్రోత్సహించకుండా చూసేందుకు అమెరికా వాణిజ్య భాగస్వాములలో ప్రతి ఒక్కరూ మరింతగా కృషి చేయాలి. భారత్, చైనా, జపాన్, బ్రెజిల్, ఆస్ట్రేలియా, యూకే, సౌదీ అరేబియాతో సహా 54 దేశాలు వెట్టిచాకిరీ చేసే కార్మికులు తయారుచేసిన దిగుమతులపై నిషేధాన్ని విధించడంలో విఫలమయ్యాయి. కెనడా, ఈక్వెడార్, యూరోపియన్ యూనియన్ (ఈయూ), ఇండోనేసియా, మెక్సికో, పాకిస్థాన్ దేశాలు నిషేధాన్ని సమర్థవంతంగా అమలు చేయలేకపోయాయి. ఈ సుంకాలపై విచారణలకు హాజరు కావాలనుకునే దేశాలు తమ వాంగ్మూల సారాంశంతో కూడిన అభ్యర్థనలను జూన్ 22 నాటికి సమర్పించాలి. అలాగే తమ లిఖితపూర్వక అభ్యర్థనలను జులై 6 నాటికి పంపాలి. ఈ విచారణలకు సంబంధించి ప్రతిపాదించిన చర్యలపై యూఎస్ ట్రేడ్ రిప్రజెంటేటివ్ జులై 7న ఎంక్వైరీ చేస్తుంది. " అని జెమీసన్ గ్రీర్ పేర్కొన్నారు.

### 54 దేశాలపై 12.5 శాతం, ఆరు దేశాలపై 10 శాతం టారిఫ్‌లు

వెట్టిచాకిరీ చేసే కార్మికులు తయారుచేసిన దిగుమతులపై వచ్చిన ఆరోపణలపై యూఎస్ వాణిజ్య ప్రతినిధి కార్యాలయం 60 దేశాలపై విచారణ చేపట్టింది. అనంతరం 54 దేశాలపై 12.5 శాతం అదనపు సుంకాలను ప్రతిపాదిస్తూ నిర్ణయం తీసుకుంది. వీటిల్లో భారత్‌తో పాటు చైనా, జపాన్, బ్రెజిల్, ఆస్ట్రేలియా, యూకే, సౌదీ అరేబియా, ఇజ్రాయెల్, ఖతార్, రష్యా, సింగపూర్, దక్షిణ కొరియా, శ్రీలంక, స్విట్జర్లాండ్, తైవాన్, థాయ్‌లాండ్, తుర్కియే, యూఏఈ ఉన్నాయి. వెట్టిచాకిరీ చేసే కార్మికులు తయారుచేసిన దిగుమతులపై నిషేధం విధించడంలో ఈ దేశాలు విఫలమైనట్లు యూఎస్ వాణిజ్య ప్రతినిధి కార్యాలయం స్పష్టం చేసింది. మరోవైపు, కెనడా, ఈక్వెడార్, ఈయూ, ఇండోనేసియా, మెక్సికో, పాకిస్థాన్ దేశాలు వెట్టిచాకిరీ చేసే కార్మికులు తయారుచేసిన దిగుమతులపై నిషేధం విధించినప్పటికీ, వాటిని సమర్థవంతంగా అమలు చేయలేకపోయాయనే కారణంతో ఆయా దేశాలపై 10శాతం అదనపు సుంకాలు విధించాలని అమెరికా ప్రభుత్వాన్ని కోరింది.

### ఆరోపణలను ఖండించిన భారత్

వెట్టిచాకిరీ చేసే కార్మికులు తయారుచేసిన దిగుమతులపై అమెరికా చేసిన ఆరోపణలపై భారత్ స్పందించింది. అగ్రరాజ్యానికి ధీటుగా బదులిచ్చింది. ఇలాంటి వాటిని ద్వైపాక్షిక వాణిజ్య చర్చల్లో పరిష్కరించుకోవాలని సూచించింది. భారత్‌పై దర్యాప్తును ఆపేయాలని స్పష్టం చేసింది.

### అమెరికా- భారత్ చర్చలు

కాగా, భారత్- అమెరికా మధ్య చాలా కాలంగా వాణిజ్య ఒప్పందానికి సంబంధించి చర్చలు కొనసాగుతున్నాయి. ఇప్పుడు కూడా దిల్లీలో కీలక చర్చలు జరుగుతున్నాయి. యూఎస్ ప్రధాన వాణిజ్య చర్చల ప్రతినిధి బ్రెండన్ లించ్ నేతృత్వంలోని బృందం జూన్ 1- 4 వరకు భారత్‌లోని అధికారులతో సమావేశమవుతోంది. ఈ చర్చల్లోనే మధ్యంతర వాణిజ్య ఒప్పందం సహా విస్తృత ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందంపైనా చర్చలు జరుపుతున్నారు. సుంకేతర చర్యలు, కస్టమ్స్, వాణిజ్య సౌలభ్యం, పెట్టుబడుల ప్రోత్సాహం, ఆర్థిక భద్రతా సమన్వయం వంటి అంశాలపై చర్చిస్తున్నారు.

# విమానయాన రంగానికి ప్యాకేజీ-

- రహదారులకు భారీగా నిధులు
- కేంద్ర క్యాబినెట్ కీలక నిర్ణయాలు



**టీ మీడియా జూన్ 3 , ఢిల్లీ బ్యూరో :** రవాణా రంగం బలోపేతానికి కేంద్ర కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. 24,249 కోట్ల పెట్టుబడితో 4 ప్రధాన రహదారి ప్రాజెక్టులకు ఆమోదం లభించింది. ఇందులో తెలంగాణకు చెందిన -63, 563 జాతీయ రహదారుల విస్తరణకు ఆమోదం దక్కింది. ఈ వివరాలను కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడించారు. దేశవ్యాప్తంగా కనెక్టివిటీని మెరుగుపరచడం, ప్రయాణ సమయాన్ని తగ్గించడం, సరకు రవాణా సామర్థ్యాన్ని పెంచే లక్ష్యంతో ఈ నాలుగు ప్రధాన రహదారి ప్రాజెక్టుల నిర్మాణాన్ని చేపట్టనున్నట్లు తెలిపారు. బుధవారం ప్రధాని మోదీ అధ్యక్షతన కేంద్ర క్యాబినెట్ మీటింగ్ జరిగింది. ఈ సమావేశంలో కీలక నిర్ణయాలను తీసుకున్నారు. క్యాబినెట్?లో తీసుకున్న నిర్ణయాలను అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. వీటి ద్వారా మౌలిక సదుపాయాలు మెరుగవ్వడమే కాకుండా ఉపాధి అవకాశాలు భారీగా పెరుగుతాయని అశ్విని వైష్ణవ్ చెప్పారు. అలాగే, దిల్లీలో పాత ట్రక్కులు, బస్సులు తొలగించాలని కేంద్ర కేబినెట్ నిర్ణయించినట్లు తెలిపారు. పాత బస్సుల స్థానంలో బీఎస్ 6, ఈవీ వాహనాలు తేవాలని నిర్ణయించినట్టు చెప్పారు. కొత్త వాహనాల కోసం 5 వేల 41 కోట్ల విడుదలకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపినట్టు వివరించారు. మరోవైపు, పశ్చిమాసియా సంక్షోభం, పాక్ గగనతల మూసివేత వంటి సవాళ్ల నేపథ్యంలో దేశీయ విమానయాన రంగాన్ని ఆదుకునేందుకు కేంద్ర కేబినెట్ సరికొత్త వ్యూహాత్మక ప్యాకేజీకి ఆమోదం తెలిపింది. ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయెల్- ఎ టి ఎఫ్ ధరల భారం నుంచి విమానయాన సంస్థలను కాపాడటానికి చమురు సంస్థలకు 10 వేల కోట్లను వడ్డీ లేని ఆర్థిక సాయంగా ప్రకటన చేసింది.

# మాజీ ఎమ్మెల్సీ కిడ్నాప్

- రూ.3 కోట్లకు డీల్



**టీ మీడియా జూన్ 3 , బెంగళూరు :** కర్ణాటక మాజీ ఎమ్మెల్సీ దయానంద రెడ్డిని కిడ్నాప్ ఘటన రాష్ట్రంలో సంచలనం సృష్టించింది. రూ.10 కోట్లకు సుపారీ మాట్లాడుకుని కిడ్నాప్ చేయగా, ప్లాన్ రివర్స్? అయ్యింది. అదే డబ్బులు తానే ఇస్తానని చెప్పి, కిడ్నాపర్లను బురిడీ కొట్టించి తప్పించుకున్నారు. తర్వాత పోలీసులను ఆశ్రయించడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది.

### అసలేం జరిగిదంటే?

అనేకల్ తాలూకాలోని హీలలిగె సమీపంలో దయానంద రెడ్డికి చెందిన గోల్డ్ కాయిన్ క్లబ్ వద్ద ఈ కిడ్నాప్ జరిగింది. సోమవారం అర్ధరాత్రి క్లబ్ నుంచి బయటకు వస్తున్న సమయంలో బైక్‌పై వచ్చిన ఇద్దరు వ్యక్తులు ఆయన కారును అడ్డగించారు. "మీకు గిఫ్ట్ బాక్స్ వచ్చింది" అంటూ ఒక పెట్టె చూపించారు. దానిని తీసుకునేందుకు దయానంద కారు డోర్ తెరిచిన వెంటనే దుండగులు లోపలికి చొరబడి డ్రైవర్‌పై తుపాకీ గురిపెట్టారు. అలాగే తాము చెప్పిన దిశగా వాహనం నడపాలని డ్రైవర్?ను బెదిరించారు.

### రూ.10 కోట్ల సుపారీ

అదే సమయంలో ఎర్ర రంగు కారులో వచ్చిన మరో ఇద్దరు దుండగులు వారిని అనుసరించారు. అనంతరం దయానంద రెడ్డి, ఆయన డ్రైవర్‌ను నిందితులు అట్టిబెలె కేఎచ్‌బీ లేఔట్ ప్రాంతానికి తీసుకెళ్లారు. అక్కడ తమ ప్రాణాలు తీసేస్తామని బెదిరించినట్లు వారు తెలిపారు. తమకు ఎవరో రూ.10 కోట్ల 'సుపారీ' ఇచ్చారని, అంతే కాకుండా ఆయన్ను హత్య చేయాలని ఆదేశించారని చెప్పినట్లు పోలీసు వర్గాలు వెల్లడించాయి.

### ఫోన్ నెంబర్ ఇచ్చి

ఈ సందర్భంగా దయానంద రెడ్డి ప్రాణభయంతో నిందితులను వేడుకున్నట్లు సమాచారం. "నన్ను చంపొద్దు, మీకు కావాల్సిన డబ్బు నేనే ఇస్తాను" అని చెప్పడంతో కిడ్నాపర్లు రూ.3 కోట్లు డిమాండ్ చేశారు. అయితే వెంటనే అంత మొత్తాన్ని సమకూర్చలేనని, ఉదయం బ్యాంకు తెరిచిన తర్వాత ఇస్తానని ఆయన చెప్పడంతో నిందితులు అంగీకరించారు. అనంతరం తమ మొబైల్ ఫోన్ నంబర్ ఇచ్చి, డబ్బు సిద్ధమైన తర్వాత సంప్రదించాలని సూచించి అక్కడే వదిలి వెళ్లిపోయినట్లు తెలుస్తోంది.

### రూ.10 కోట్లకు బదులు రూ.3 కోట్లు

తమని కిడ్నాప్ చేసిన నిందితులు ట్రేడింగ్‌లో నష్టపోయి అప్పుల్లో కూరుకుపోయారని వారు చెప్పినట్లు దయానంద తెలిపారు. ఆయన గురించి వికీపీడియాలో తెలుసుకుని, ఆయన చాలా ధనవంతుడని భావించి, డబ్బు కోసం లక్ష్యంగా ఎంచుకున్నారని వారు చెప్పారని అన్నారు. రూ.10 కోట్ల సుపారీకి బదులుగా రూ.3 కోట్లు ఇస్తే మిమ్మల్ని వదిలేస్తామని చెప్పారని వెల్లడించారు. దాంతో ప్రాణాల కోసం తాను డబ్బు ఇస్తానని చెప్పడంతో నిందితులు ఆయన్ని విడుదల చేశారని ఆయన తెలిపారు.

### ముందుగానే నిఘా పెట్టి కిడ్నాప్?

అలాగే, నిందితులు దాదాపు 15 రోజుల క్రితమే ఈ ప్రాంతానికి వచ్చి యాదవనహల్లి సమీపంలో ఓ ఇల్లు అద్దెకు తీసుకుని ధనవంతులను కిడ్నాప్ చేసే పథకం రచించినట్లు ఆయన ఆరోపించారు. తనపై ముందుగానే నిఘా పెట్టి ఈ దాడికి పాల్పడినట్లు తెలిపారు. ఈ ఘటనపై దయానంద రెడ్డి అట్టిబెలె పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

# నత్తనడకన సాగుతున్న పాలమూరు పెద్దాసుపత్రి నిర్మాణం

- పేదలకు తప్పని ఎదురుచూపులు



**టి మీడియా, జూన్ 3, హైదరాబాద్ బ్యూరో :** ఉమ్మడి పాలమూరు వాసులకు పెద్దాసుపత్రి కోసం ఎదురుచూపులు తప్పేలా లేదు. వెయ్యి పడకలతో సూపర్ స్పెష్టాలిటీ ఆస్పత్రి నిర్మాణం చేస్తున్నప్పటికీ ఏళ్లుగా పనులు ముక్కుతూ, మూలుగుతూ సాగుతున్నాయి. ఇప్పటివరకూ ఏ, బీ, సీ, డీ నాలుగు బ్లాకుల్లో పనులు పూర్తయ్యాయి. కోర్టు కేసు, ఇతర కారణాలతో ఈ-బ్లాకు నిర్మాణంలో జాప్యం జరిగింది. ఆస్పత్రి నిర్మాణం పూర్తయ్యే సరికి మరో ఆర్నెళ్ల సమయం పట్టేలా కనిపిస్తోంది. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా వాసులకు మెరుగైన వైద్య సేవలందించేది.. ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలోనే. ఓపీ, ఎమర్జెన్సీ, డెలివరీ తదితర సేవల కోసం సుమారు రోజుకు 2,500 నుంచి 3 వేల మంది వరకు రోగులు ఆస్పత్రికి వస్తుంటారు. వచ్చిన వారికి ఇక్కడ వైద్యం అందిస్తున్నప్పటికీ సూపర్ స్పెషాలిటీ సేవల కోసం మాత్రం హైదరాబాద్‌లోని నిమ్స్, గాంధీ వంటి ఆస్పత్రులకు పంపించాల్సి వస్తోంది. ఆర్థిక ఇబ్బందులతోపాటు అత్యవసర కేసులలో ఆలస్యం కారణంగా ప్రాణాలు పోతున్నాయి. ఈ బాధలు తప్పించేలా సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణానికి 2022 డిసెంబర్ 25న నాటి వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు భూమిపూజ చేశారు. ఆస్పత్రిలోని ఏ, బీ, సీ, డీ బ్లాకులలో పనులు దాదాపు పూర్తయ్యాయి. ఐదో బ్లాకులో మాత్రం ఇంకా కొనసాగుతున్నాయి.

ఆసుపత్రిలో 14 సేవలు

నిర్మాణంలో ఉన్న ఈ-బ్లాకులో ట్రామాకేర్, గైనకాలజీ విభాగం, ఐసీయూ, బ్లడ్ బ్యాంకు తదితర కీలక విభాగాలున్నాయి. ప్రస్తుతం పాత భవనంలోనే జీజీహెచ్? కొనసాగుతుండగా నిత్యం పేషెంట్ల రద్దీ పెరుగుతోంది. జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, గైనకాలజీ, ఈఎన్టీ వంటి 14 సేవలందిస్తున్నారు. సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి అందుబాటులోకి వస్తే న్యూరో సర్జరీ, యూరాలజిస్ట్, కిడ్నీ ట్రాన్స్ ప్లాంటేషన్ వంటి కీలక సేవలందించవచ్చని జీజీహెచ్? సూపరింటెండెంట్ డాక్టర్ అజ్మీరా రంగా నాయక్ తెలిపారు. ఇక్కడ 14 వైద్య సేవలు మాత్రమే చేయగలుగుతున్నాం. అదే సూపర్? స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణం అయితే కిడ్నీ స్పెషలిస్ట్?, న్యూరో సర్జరీ స్పెషలిస్ట్?, న్యూరాలజిస్ట్?, నెఫ్రాలజిస్ట్? ఇలాంటి సూపర్? స్పెషాలిటీ సేవలను కూడా మనం అందుబాటులోకి తేవచ్చు. దాని ద్వారా ఇక్కడేమైనా ఇబ్బంది ఉంటే వారికి సూపర్? స్పెషాలిటీ ఆసుపత్రిని రెఫర్? చేయాల్సిన అవసరం ఉండదు. మన వద్దనే ట్రిట్?మెంట్? చేసుకునే అవకాశం ఉంటుంది. మనకు సూపర్? స్పెషాలిటీ వస్తే రోగుల సంఖ్య ఇంకా పెరుగుతుంది. ఇక్కడికి వచ్చిన రోగి ఎవరినీ కూడా హైదరాబాద్? పంపించాల్సిన అవసరం ఉండదు" - డా. అజ్మీరా రంగా నాయక్ , జీజీహెచ్ సూపరింటెండెంట్

పూర్తైన 4 బ్లాకులను ప్రారంభించే యోచనలో ప్రభుత్వం

ఈ-బ్లాకు కోసం ఎదురుచూడకుండా పూర్తైన 4 బ్లాకులను ప్రారంభించే యోచనలో ప్రభుత్వం ఉందని అధికారులు చెబుతున్నారు. ఐతే, వాటిలో వైద్య పరికరాలు, కుర్చీలు, బెడ్ల వంటి ఫర్నీచర్ ఇంకా ఏర్పాటు చేయలేదు. జీజీహెచ్?లోనే దాదాపు 30 శాతం ఖాళీలుండగా సూపర్ స్పెషాలిటీ పోస్టులు ప్రకటించి భర్తీ చేయాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వం త్వరితగతిన చర్యలు తీసుకుంటే మహబూబ్‌నగర్‌తో పాటు వనపర్తి, నాగర్‌కర్నూల్, జోగులాంబ గద్వాల, నారాయణపేట జిల్లా వాసులకు కీలకమైన వైద్య సేవలు అందే అవకాశం ఉంది.

# భూముల ధరలు పెంచిన ప్రభుత్వం

కొత్త కనీస రేట్లు ఖరారు చేశామని వెల్లడించారు. 2021 తర్వాత నిర్మాణ వ్యయాలు సవరించకపోవడంతో కొత్త రేట్ల అవసరం ఏర్పడిందన్నారు. నిర్మాణ సామగ్రి ధరలు, కార్మికుల వేతనాల పెరుగుదలను పరిగణనలోకి తీసుకున్నట్లు తెలిపారు. ఆర్‌సీసీ, నాన్-ఆర్‌సీసీ నిర్మాణాల రేట్లను గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో సవరించామని వివరించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా, పారదర్శకతతో ఈ సవరణలు చేపట్టామని అన్నారు. దీని ద్వారా భూ లావాదేవీలలో పారదర్శకత పెరగడంతో పాటు ప్రభుత్వ ఆదాయం కూడా వృద్ధి చెందుతుందని వెల్లడించారు.

### బీఆర్ఎస్‌పై విమర్శల వర్షం

ఈ భూముల విలువల సవరణలో భాగంగా ప్రాంతాల వారీగా మార్కెట్ ధరలు, రిజిస్ట్రేషన్లు, ప్రభుత్వ విలువల మధ్య వ్యత్యాసాలను పరిశీలించామని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి పేర్కొన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం శాస్త్రీయ అధ్యయనం లేకుండా భూముల ధరలను పెంచిందని విమర్శించారు. 2021-22లో ఆరు నెలల వ్యవధిలో రెండు సార్లు భూముల విలువలు పెంచారని వెల్లడించారు. రిజిస్ట్రేషన్ ఛార్జీలను 6 శాతం నుంచి 7.5 శాతానికి పెంచిందని బీఆర్ఎస్ ప్రభుత్వంపై విమర్శల వర్షం కురిపించారు. గత ప్రభుత్వ సవరణల్లో కొన్ని చోట్ల మార్కెట్ ధరల కంటే తక్కువ, మరికొన్ని చోట్ల ఎక్కువగా విలువలను నిర్ణయించారని చెప్పుకొచ్చారు.



# రాష్ట్రంలో 2 రోజులపాటు భారీ వర్షాలు

- 16 జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ

**టీ మీడియా జూన్ 3 , హైదరాబాద్ బ్యూరో :** తెలంగాణ రాష్ట్రంలో పలు జిల్లాల్లో ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నట్లు వాతావరణశాఖ ప్రకటించింది. ఉపరితల ఆవర్తనం, ద్రోణి ప్రభావంతో తెలంగాణలో ఇవాళ రేపు ఉరుములు మెరుపులు ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని, గంటకు 50 నుంచి 60 కిలో మీటర్ల వేగంతో ఈదురు గాలులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉందని తెలిపింది. ఉరుములు, మెరుపులతో ఈదురు గాలులు : ఉమ్మడి ఆదిలాబాద్ పాటు కుమురంభీం ఆసిఫాబాద్?, నిర్మల్?, మంచిర్యాల, నిజామాబాద్?, జగిత్యాల, కరీంనగర్?, రాజన్న సిరిసిల్ల, పెద్దపల్లి, ములుగు, జయశంకర్? భూపాలపల్లి, భద్రాద్రి కొత్తగూడెం, నల్గొండ, ఖమ్మం, సూర్యాపేట, హనుమకొండ, వరంగల్? జిల్లాలకు ఆరెంజ్? అలర్ట్ హెచ్చరికలు? ?జారీ చేసింది. ఉమ్మడి మహబూబ్ నగర్, రంగారెడ్డి, హైదరాబాద్?తో పాటు యాదాద్రి భువనగిరి జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ జారీ చేసింది. ఉరుములు, మెరుపులతో ఈదురు గాలులు వీస్తాయని హెచ్చరించింది. ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్ తో పాటు నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, నిజామాబాద్ జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలు, ఉమ్మడి ఖమ్మం, రంగారెడ్డి, హైదరాబాద్, మెదక్, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ చేశారు.

### నైరుతి రుతుపవనాలు తాకే అవకాశాలు

గురువారానికి కేరళ, తమిళనాడులను నైరుతి రుతుపవనాలు తాకే అవకాశాలు ఉన్నట్లు తెలిపింది. మంగళవారం పలు జిల్లాల్లో భారీ వర్షాలు నమోదయ్యాయి. ఖమ్మం జిల్లా ఏన్కూరు మండలంలో 7.9 సెం.మీ వర్షపాతం నమోదైంది. ఈ జిల్లాలోని తల్లాడలో 6 సెం.మీ, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట 4 సెం.మీ, దమ్మపేట 3 సెం.మీ, ములుగు జిల్లా వెంకటాపురం మండలంలో 1.7 సెం.మీ వర్షం కురిసింది. సూర్యాపేట జిల్లా గరిడేపల్లిలో 44.8 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. మిగతా 27 జిల్లాల్లో 40.2 - 44.7 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

